# ఫ్లాష్ బ్యాక్



పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

## మద్దిపట్ల సూరి

### (1972, డిసెంబర్ విజయచిత్ర నుంచీ పునర్ముద్రణ)



తెల్లని పైజమా, పైన తెల్లని పొడుగు చేతుల జుబ్బా, కళ్ళజోడు, చిన్న బట్టతలతో కనిపించే సూరిగారిని చూస్తే బెంగాలి మనిషి అనుకోడం ఖాయం. సూరిగారిని చూడని వాళ్ళుంటే— బెంగాలి మనిషిలా వుండి, స్వచ్ఛమైన మంచి తెలుగు మాట్లాడే మనిషెవరైనా కనిపిస్తే— ఆయనే సూరిగారని నిర్ధారణగా తేల్చేసుకోవచ్చును. కలకత్తాలాంటి రద్దీ పట్నంలో సూరిగారు వెళ్తూ వుంటే, ఆ జనంలో 'ఆయన ఎక్కడున్నారు?' అని కనుక్కోవడం — మరీ కష్టం.

అయితే, సూరిగారి కట్టూ బొట్టూ వంగ దేశాచారపు పద్ధతిలో ఉండడానికి కారణం ఏదైనా— కొంతవరకూ ఆయన వంగ వ్యక్తే. ఎన్నో బెంగాలి నవలలు, కథలూ ఆయన తెలుగు భాషలోకి అనువదించి, బెంగాలి రచనలనూ, రచయితలనూ పరిచయం చేశారు. ఆయన తెలుగు చేసిన వంగ పుస్తకాలు 50కి పైగా వుంటాయి. అలా 'మద్దిపట్ల సూరి' సాహిత్యాభిమానులకు ఎప్పట్నుంచో తెలిసినవారు.

**తెల్లని పైజమా**, పైన తెల్లని పొడుగు చేతుల జుబ్బా, కళ్ళజోడు, చిన్న బట్టతలతో కనిపించే సూరిగారిని చూస్తే బెంగాలి మనిషి అనుకోడం ఖాయం. సూరిగారిని చూడని వాళ్ళుంటే బెంగాలి మనిషిలా వుండి, స్వచ్ఛమైన మంచి తెలుగు మాట్లాడే మనిషెవరైనా కనిపిస్తే ఆయనే సూరిగారని నిర్ధారణగా తేల్చేసుకోవచ్చును. కలకత్తాలాంటి రద్దీ పట్నంలో సూరిగారు వెళ్తూ వుంటే, ఆ జనంలో 'ఆయన ఎక్కడున్నారు ' అని కనుక్కోవడం మరీ కష్టం.

అయితే, సూరిగారి కట్టూ బొట్టూ వంగదేశాచారపు పద్ధతిలో ఉండడానికి కారణం ఏదైనా కొంతవరకూ ఆయన వంగ వ్యక్తే. ఎన్నో బెంగాలి నవలలు, కథలూ ఆయన తెలుగు భాషలోకి అనువదించి, బెంగాలి రచనలనూ, రచయితలనూ

పరిచయం చేశారు. ఆయన తెలుగు చేసిన వంగ పుస్తకాలు 50కి పైగా వుంటాయి. అలా 'మద్దిపట్ల సూరి' సాహిత్యాభిమానులకు ఎప్పట్నుంచో తెలిసినవారు.

శరత్ చంద్ర ఛటర్జీ, తారాశంకర్, బెనర్జీ వంటి రచయితల దగ్గర్నుంచి చాలామంది వంగ రచయితల రచనలను తెలుగు పాఠకులకు సూరి పరిచయం చేశారు. 'స్వయంసిద్ధ', 'పథేర్‌పాంచాలి' 'గణదేవర' (పత్రికలలో సీరియల్‌గా వచ్చాయి) జీవనలీల వంటి ఉత్తమ రచనలను చదివే అవకాశాన్ని తెలుగు వారికి కలగజేసిన సూరిగారు బెంగాలి భాష స్వయంగా నేర్చుకుని సాధించిన విద్య అని విన్నప్పుడు ఎవరికైనా ఆశ్చర్యంగానే వుంటుంది.

సూరిగారు చిన్నప్పుడు సంస్కృతం బాగా చదువుకున్నారు. హిందీ స్వయంగా అభ్యసించారు. ఆకురాజు చలమయ్యగారనే సూరిగారి శ్రేయోభిలాషి – "సంస్కృతం, హిందీ వస్తే బెంగాలి రావడం అట్టే కష్టంకాదు" అన్నారు. ఆయన బెంగాలి బాగా అభ్యసించిన వ్యక్తి. ఆయన మాటను ఊతగా తీసుకుని, సూరి ఉత్సాహంగా వంగ అభ్యాసం కూడా మొదలుపెట్టారు. ఒక భాష నేర్చుకోవడం వేరు, దాంట్లో ప్రావీణ్యం సంపాయించడం వేరు. ఎంతమందికో ఎన్ని భాషలో తెలిసి వుండొచ్చు. కానీ ఆ తెలిసిన భాషలో వున్న పుస్తకాలను సొంత భాషలో రాయగల ప్రజ్ఞ మాత్రం కొందరికే వుంటుంది. తాను నేర్చుకున్న భాష ఇంతదూరం ఉపయోగపడుతుందన్న విషయం బహుశా, సూరిగారికే అపట్లో తెలిసి వుండకపోవచ్చు.

సూరిగారి బాల్యం, చదువూ బందర్లో జరిగాయి. వారి సొంత వూరు అమృతలూరు. బందర్లో ఉండగా అడవిబాపిరాజు, మల్లాది రామకృష్ణశాస్త్రి మొదలైన కవులతో పరిచయం ఏర్పడింది. వారి సాంగత్యంలో తానూ చిన్న చిన్న రచనలు చెయ్యడం ఆరంభించారు. రచనా వ్యాసంగం అలా అలవాటయింది ఆయనకి.

1944లో మద్రాసు వచ్చేవరకూ సూరిగారు ఎక్కడా ఉద్యోగం చెయ్యలేదు. ఒక ప్రింటింగ్ ప్రెస్‌లో ఉద్యోగం వస్తే మద్రాసు వచ్చారు. అది 'స్వర్గసీమ' నిర్మాణానికి ముందు సమయం. చక్రపాణిగారు 'స్వర్గసీమ 'కు కథకుడు. ఆయనతో, సూరిగారికి అంతకుముందే కొంత పరిచయం వుంది. తర్వాత ఇద్దరూ స్నేహితులుగా మారారు. ఇద్దరూ వంగభాష తెలిసినవారూ, వంగ రచనలను తెనిగించినవారూ. సూరిగారు మద్రాసులో రెండు సంవత్సరాలు వుండి, సొంతంగా పబ్లికేషన్స్ ప్రారంభించాలని వెళ్ళి పోయారు. మద్రాసులో వున్న ఆ రెండేళ్ళ 'ప్రెస్ జీవితం'లోనూ, ఆయన కొంతకాలం 'రూపవాణి' పత్రికలో 'పార్ట్‌టైం' పనికూడా చేశారు.

1950లో చక్రపాణిగారి దగ్గర్నుంచి ఒక ఉత్తరం వచ్చింది. అందులో మద్రాసు రమ్మని వుంది. ఎందుకో, ఏమిటో అన్న విషయం అవగాహనకాకపోయినా, సూరిగారు వెంటనే మద్రాసు చేరుకున్నారు.

"మేము విజయా ప్రొడక్షన్స్ ప్రారంభించాము. ఇందులో 'స్టోరీ డిపార్ట్‌మెంటు'వుంది. నువ్వు ఈ డిపార్ట్‌మెంటులో పనిచెయ్యి" అన్నారు చక్రపాణి. సూరి, అలా సినిమా ప్రపంచంలో ప్రవేశించారు. అప్పుడే 'పాతాళభైరవి' నిర్మాణం ఆరంభమైంది. కె.వి.రెడ్డి, ప్రసాద్, కె.కామేశ్వరరావు మొదలైన దర్శకులతో పరిచయాలు ఏర్పడ్డాయి. సినిమా రచన, సినిమా పరిజ్ఞానం మొదలైన విషయాలు ఒక్కటొక్కటే సూరికి తెలియసాగాయి.

విజయా స్టోరీ డిపార్టుమెంటులో సూరి ఐదేళ్ళు పనిచేశారు. కేవలం కథా చర్చలు, కథలకు సంబంధించిన విషయాలే కాకుండా, స్క్రీన్‌ప్లేలు రాయడం అంటే ఏమిటి? దృశ్యాల విభజన ఎలా వుంటుంది? సంభాషణలు ఎలా రాస్తారు? మొదలైన విషయాలు కూడా బాగా నేర్చుకున్నారు. 'మిస్సమ్మ ' చిత్రం విడుదలైన తర్వాత, సూరికి రచయితగా ఒక అవకాశం వచ్చింది. ఆర్.ఆర్.పిక్చర్స్ వారు 'కార్తవరాయని కథ' ఆరంభిస్తూ, మాటల రచయితగా సూరిగారికి అవకాశం కల్పించారు. అదే, ఆయన తొలి చిత్రం. అక్కడినుంచి ఆయన రచయితగానే స్థిరపడి, వరకట్నం, మాతృదేవత, పచ్చని సంసారం, భలే తమ్ముడు, మా వదిన, పండంటి కాపురం మొదలైన ఇరవై చిత్రాలకు ఇంతవరకూ రచన చేశారు. కొన్ని డబ్బింగ్ చిత్రాలకు కూడా మాటలు రాశారు. ఇటీవల వచ్చిన 'కన్నతల్లి' చిత్రానికి కథ కూడా రాశారు.

సూరిగారు సొంతంగా రాసిన 'పాపికొండలు' అన్న కథల సంపుటి అచ్చయింది. మొదట్లోనే హిందీ నుంచి కూడా ఒకటి రెండు అనువాదాలు చేశారు. బెంగాలి రచనల అనువాదాలు ఆరంభించిన తర్వాత, హిందీ అనువాదాలు చెయ్యలేదు. చాలా రేడియో నాటకాలు కూడా రాశారు.

ఒక భాషలో వున్న నవల, ఇంకో భాషలో బహుళ ప్రచారం పొందడానికి అనువాదం చాలా సరళంగా వుండాలి. దానికి అనువాదం రాకుండా, 'మాతృకేనేమో ' అన్నంత సహజంగా వున్నప్పుడే ఆ పుస్తకం రాణిస్తుంది.

'మాతృక ఎంత గొప్ప రచయినా, అనువాదం సవ్యంగా లేకపోతే, ఆ రచనలో వున్న ఘనత తప్పకుండా చెడుతుంది ' అంటారు. సూరిగారి అనువాదాలు ఎక్కడా అనువాదాలు అనిపించవు. భాష, నుడికారం అంతా పచ్చి పదహారణాల తెలుగుదనంతో కనిపిస్తుంది.

"సినిమా రచన ఒక పరిధిలో వుండి చెయ్యవలసిన రచనే అయినా, దానికీ స్వాతంత్ర్యం వుండాలి. రచయితకు స్వేచ్ఛ బాగా అవసరం. పరిపూర్ణమైన స్వతంత్రం – ప్రతి రచయితకూ వుండవలసినట్టే, సినిమా రచయితకూ వుండాలి. వున్నప్పుడే తన భావాలు, ఊహలూ రాగలుగుతాయి. స్వేచ్ఛ లేకపోతే, రచన రాణించదు. రచయిత న్యాయమూ చేకూర్చలేదు" అంటారు సూరిగారు. పచ్చని సంసారం, పండంటి కాపురం చిత్రాల కథా చర్చలలో తనకు మంచి స్వేచ్ఛ లభించిందని కూడా అన్నారాయన.

ఇటీవల జరిగిన 'పండంటి కాపురం' శతదినోత్సవంలో ఆ చిత్ర కథా రచయిత, నిర్మాణ భాగస్వామి అయిన, ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ "పండంటి కాపురం కథకుడిని నేనే కావచ్చు. కానీ, నేను తయారుచేసినది మూలకథ మాత్రమే. ఆ కథకు పరిపూర్ణమైన రూపాన్ని కల్పించడంలో, తెరకు చెప్పడానికి కావలసిన సన్నివేశాల కల్పన, పాత్రల ప్రవర్తనలూ మొదలైనవన్నీ రూపొందించడంలో దర్శకుడు లక్ష్మీదీపక్, రచయిత సూరిగార్ల కృషి చాలా వున్నది. కొన్ని కొన్ని కొన్ని సన్నివేశాల కల్పనకు సూరిగారు చాలా దోహదం చేశారు" అన్నారు. కథను నడిపించడంలో మాటల రచయితకు కూడా ఎలాటి బాధ్యత  వున్నదీ, అతనికి ఎలాంటి ప్రజ్ఞ అవసరం అన్న విషయం పై విషయం వల్ల అవగాహన అవుతుంది.

చిత్రాలలో పాటలు రాయగల సామర్థ్యం సూరిగారికి వున్నప్పటికీ ఆయన తెలుగు పాట ఏదీ రాయలేదు గాని, 'కలిసొచ్చిన అదృష్టం'లో ఒక బెంగాలీ పాట రాశారు. అదొక చిన్న విశేషం.

ప్రస్తుతం సూరిగారు అర్చనా ఫిలింస్ అనే సంస్థ నిర్మించనున్న చిత్రానికి, ప్రభాకరరెడ్డి, యస్. భావనారాయణ తియ్యబోతున్న చిత్రాలకూ రచన చేస్తున్నారు. ఆయన మాటలు రాస్తున్న 'నిండు కుటుంబం' చిత్రం షూటింగ్ కార్యక్రమాల్లో వున్నది.

COMMENTS